ఈనాడు
తూర్పుగోదావరి
బుధవారం 28 మార్చి 2018 .. 16 పేజీలు

# ఆటంకాలు అధిగమిస్తేనే జీవితం

## జేఎన్‌టీయూకే క్రీడా దినోత్సవంలో కరణం మల్లీశ్వరి

**భానుగుడి సెంటర్, వెంకట్‌నగర్(కాకినాడ):** ప్రతి ఓటమి వెనుక విజయం ఉంటుందని, ఎక్కడ విఫలమయ్యామో అక్కడ్నుంచే మన ప్రయాణం పునః ప్రారంభించాలని పద్మశ్రీ, రాజీవ్‌ఖేల్‌రత్న పురస్కార గ్రహీత కరణం మల్లీశ్వరి అన్నారు. జేఎన్టీయూకే అలూమ్ని ఆడిటోరియంలో మంగళవారం జరిగిన క్రీడా దినోత్సవానికి ఆమె ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరణం మల్లీశ్వరి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణ, లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. చిన్నప్పట్నుంచి పెద్దయ్యేవరకు ఎన్నో ఆటంకాలు వస్తాయి.. వాటన్నింటిని అధిగమించి ముందుకు వెళితేనే అసలైన జీవితం ఉంటుందన్నారు. క్రీడాకారులందర్నీ ఓచోట చూస్తుంటే మీలో ప్రతి ఒక్కరూ విజేతగా కనిపిస్తున్నారన్నారు. మీరు చదువుతోపాటు క్రీడలను కొనసాగించి దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. వీసీ ప్రొఫెసర్ వీఎస్ఎస్ కుమార్ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి యూనివర్సిటీ కృషి చేస్తోందన్నారు. ఏటా లక్షలాది రూపాయలు క్రీడలకోసం ఖర్చుచేస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు మాట్లాడుతూ




**వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక సందడి**

పాఠ్యప్రణాళికలో క్రీడలను భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రిన్సిపాల్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ కళాశాల క్రీడాకారులు అఖిల భారత స్థాయిలో ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. క్రీడల కార్యదర్శి డాక్టర్ జి.శ్యాంకుమార్ మాట్లాడుతూ వైస్‌చాన్సలర్ ట్రోఫీని 48.5పాయింట్లతో జేఎన్టీయూకే దక్కించుకోగా వీటిలో 42 పాయింట్లను కేవలం మహిళలు సాధించటం గర్వకారణమన్నారు. కరణం మల్లీశ్వరిని ముఖ్యఅతిథులు సత్కరించారు. ఈ ఏడాది యూనివర్సిటీ, ఆలిండియా, అంతర్ కళాశాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథులు జ్ఞాపికలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్సు బోర్డు డైరెక్టర్ జి.అబ్బయ్య, వైస్‌ప్రిన్సిపల్ ఏఎం ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

### పుస్తక పఠనంతో సవాళ్లను అధిగమించవచ్చు

అలూమ్ని ఆడిటోరియంలో సాయంత్రం జరిగిన కళాశాల వార్షికోత్సవంలో రెక్టార్ కె.పూర్ణానందం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సబ్జెక్టుపరంగా జ్ఞానాన్ని పెంపొందించుకోవడమే కాకుండా ప్రాపంచిక విషయాలను తెలుసుకున్నట్లయితే జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చన్నారు. ఇందుకోసం పుస్తక పఠనానికి ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. సివిల్ విభాగంలో నిర్వహించచున్న స్టూడెంట్ యాక్టివిటీస్ క్లబ్(శాక్) కరపత్రాన్ని పూర్ణానందం ఆవిష్కరించారు. ఈ క్లబ్ ద్వారా వివిధ పోటీలను నిర్వహించి, విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందిస్తున్నారని పద్మకుమారి తెలిపారు. సాంస్కృతిక, విద్యా పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.